ప్రజా సేవకు అంకితం కండి

అంబర్‌పేట పీటీసీలో కానిస్టేబుల్ పాసింగ్ ఔట్ పరేడ్‌లో సీఐడీ డీజీపీ శిఖా గోయల్

గోల్నాక, నవంబర్ 21: విధి నిర్వహణలో పోలీసు పవర్‌ను ప్రజల సేవకు వినియోగించాలని రాష్ట్ర సీఐడీ విభాగం డీజీపీ షికా గోయల్ అన్నారు. హైదరాబాద్ అంబర్‌పేట పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో గురువారం శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుల్ పాసింగ్‌ఔ ట్ పరేడ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి షికా గోయల్ ముఖ్య అతిథిగా హాజరై, జనవరి నెల 2024 సంవత్సరంలో శిక్షణ పొందిన మొత్తం 768 పోలీసు కానిస్టేబుల్స్ నుంచి ఆమె దీక్షాంత్ కవాతు గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పోలీసులు తమ పవర్‌ను వ్యక్తిగత ప్రయోజనాలకు వినియోగించుకోకుండా సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు అందించాలన్నారు. శాంతి భద్రతల నిర్వహణలో కొత్త పోలీసులు భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు. అంబర్‌పేట పోలీస్ శిక్షణ కేంద్రం ప్రిన్స్‌పాల్ పి.మధుకర్ స్వామి మాట్లాడుతూ, శాంతి భద్రతలు మరింత పెంపొందించే చర్యల్లో భాగంగా తెలంగాణ పోలీస్ అమలు చేస్తున్న నూతన సంస్కరణలతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంలో కూడా శిక్షణ ఇచ్చామని తెలిపారు. మొత్తం 768 మంది కానిస్టేబుల్స్ పాసింగ్ కాగా, ఇందులో వరంగల్ జిల్లా, కరీంనగర్, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు చెందిన వారు ఉన్నారు. ఇందులో పోస్ట్ గ్రాడ్యుయేట్స్ 91 మంది, గ్రాడ్యుయేట్స్ 609 మంది ఉండటం గమనార్హం. ఈ కార్యక్రమంలో పీటీసీ వైస్ ప్రిన్సిపాల్ పిచ్చయ్య, అడ్మిన్ డీఎస్పీలు మదన్ మోహన్, విజయ్ కుమార్, ఏవో జి.రాములు పాల్గొన్నారు.

పోలీస్ ఉద్యోగం పవిత్రమైంది

ఆలోచించి పనిచేస్తూ పోలీస్ శాఖకు మంచిపేరు తేవాలి

కానిస్టేబుల్ పాసింగ్ అవుట్ పరేడ్‌లో నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్

పాసింగ్ అవుట్ పరేడ్‌లో పాల్గొన్న నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్

సిటీబ్యూరో, నవంబర్ 21(నమస్తే తెలంగాణ): పోలీసు ఉద్యోగం అనేది ఒక పవిత్రమైన ఉద్యోగమని, రాజ్యాంగానికి విధేయత చూపుతూ నిజాయితీగా ప్రజల మాన ప్రాణాలను కాపాడటంలో కర్తవ్యం నిరవర్తించాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపారు. ఏఆర్, ఐటీ అండ్ సీ, పీటీఓ, మెకానిక్ విభాగాలలో స్టైఫండరీ క్యాడెట్ ట్రైనీ పోలీస్ కానిస్టేబుల్‌గా నియామకమైన వివిధ జిల్లాలకు చెందిన 747 మంది తొమ్మిది నెలల బేసిక్ ఇండక్షన్ శిక్షణను పూర్తి చేసుకున్న వారికి గురువారం పేట్ల బురుజులోని కార్ హెడ్ క్వార్టర్స్ పరేడ్ మైదానంలో 'దీక్షాంత్ పరేడ్'ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సిటీ పోలీస్ ట్రైనింగ్ సెంటర్, పేట్ల బుర్జులో 212, బేగంపేట్ సెంటర్‌లో 313, గోషామహల్‌లో 313 శిక్షణ తీసుకున్నారు. బీఎన్ఎస్, బీఎస్ఏ, బీఎన్ఎస్, స్పెషల్ అండ్ లోకల్ లా, లా అండ్ ఆర్డర్, క్రైమ్ అండ్ ఇన్వెస్టిగేషన్, ఇంటలిజెన్స్ అండ్ ఇంటర్నల్ సెక్యూరిటీ, పర్సనాలిటీ డెవలప్మెంట్, పోలీస్ అడ్మినిస్ట్రేషన్, డాక్యుమెంటేషన్లపై ఇండోర్ తరగతులు, అవుట్ డోర్‌లో క్యాడెట్లకు యోగా, ధ్యానం, శారీరక శిక్షణ, స్క్వాడ్ డిల్, లాఠీ డ్రిల్, ఆర్మ్స్ డ్రిల్, పరేడ్ డ్రిల్, ఆయుధ వ్యూహాలు అండ్ కాల్పులు, ట్రాఫిక్ డ్రిల్ క్యాంప్ అండ్ ఫీల్డ్ క్రాఫ్ట్ వంటి వాటిలో శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ ప్రక్రియకు సంబంధించిన నివేదికను ప్రిన్సిపాల్ అదనపు డీసీపీ మద్దిపాటి శ్రీనివాసరావు సమర్పించారు. కార్ హెడ్ క్వార్టర్స్ డీసీపీ రక్షిత కృష్ణమూర్తి శిక్షణ పొందిన వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం, ముఖ్య అతిథిగా సీవీ ఆనంద్ పరేడ్‌ను పరిశీలించి, పరేడ్ నుంచి గౌరవ వందనం స్వీకరించి ఆయా పోటీలలో ప్రతిభ కనబర్చిన విజేతలకు జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా సీవీ ఆనంద్ మాట్లాడుతూ, పాసింగ్ అవుట్ పరేడ్‌ను విజయవంతం చేసిన వారికి శుభకాంక్షలు తెలిపారు. పోలీసులు ఏ ఒక్క రోజు పనిచేయకున్నా సమాజం నడవదన్నారు. 1992లో తాను ఐపీఎస్ శిక్షణ పొందానని, 80 మందితో మా పాసింగ్ అవుట్ పరేడ్ వర్షంలో జరిగిందని, తాను పోలీస్ శాఖలో చేరి 33 ఏండ్లు అవుతుందని గుర్తు చేసుకున్నారు. ఫిజికల్ ఫిట్‌నెస్‌ను కాపాడుకుంటూ ఇప్పుడు వేసుకున్న యూనిఫారం 30 ఏండ్ల తరువాత కూడా వేసుకునేలా ఉండాలని సూచించారు. 33 ఏండ్ల సర్వీస్‌లో 75-76 కిలోల మధ్యలోనే ఉంటూ ఫిట్‌నెస్ మెయింటెన్ చేస్తున్నాని, దానికి చాలా శ్రమించాల్సి ఉంటుందన్నారు. ఏది చేసినా చాలా జాగ్రత్తగా ఆలోచించి పనిచేయాలని, మీ సేవల ద్వారా పోలీస్ శాఖకు మంచి పేరు తేవాలన్నారు.

లిఫ్ట్‌గుంతలో పడి వ్యక్తి దుర్మరణం

బంజారాహిల్స్, నవంబర్ 21: ప్రమాదవశాత్తూ భవనం మీద నుంచి లిఫ్ట్ గుంతలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. మరో వ్యక్తి గాయాలపాలయ్యాడు. ఈ ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బిహార్‌కు చెందిన మహ్మద్ తయూమ్ మియా(36) అనే వ్యక్తి బృందావన్ కాలనీలో నిర్మాణంలో ఉన్న భవనంలో పనిచేస్తున్నాడు. బుధవారం భవనంలోని ఐదో అంతస్తులో పనిచేస్తున్న తయూమ్ మియా , ముఖేశ్ అనే మరో వ్యక్తి అక్కడున్న లిఫ్ట్ గుంతలో పడిపోయారు. దీంతో తీవ్రగాయాలపాలయిన తయూమ్ మియాను, ముఖేశ్‌ను స్థానికంగా ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.అప్పటికే తయూమ్ మియా మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. ముఖేశ్ తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నాడు. కనీసం సేఫ్టీ బెల్ట్‌లు లేకుండా ఐదో అంతస్తులో పనులు చేయిస్తున్న కాంట్రాక్టర్ అరిఫ్ అలీయుద్దీన్, బిల్డర్ ఫిర్దౌస్ ఖాన్‌లపై చర్యలు తీసుకోవాలంటూ గురువారం మృతుడి సోదరుడు మహ్మద్ ఖయ్యూమ్ ఫిర్యాదు చేయగా ఫిలింనగర్ పోలీసులు భారత న్యాయ సంహిత 106(1) సెక్షన్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పాత కక్షలతో పండ్ల వ్యాపారి దారుణ హత్య

సైదాబాద్, నబంబర్ 21: పండ్లవ్యాపారం చేసుకుంటున్న ఓ యువకుడిని పాతకక్షలు బలితీసుకున్నాయి. ఈ ఘటన సంతోష్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంతోష్‌నగర్ ఎంబీ హట్స్‌కు చెందిన మహ్మద్ మోహిత్‌ఖాన్ (18) పండ్ల వ్యాపారం చేస్తుంటాడు. బుధవారం రాత్రి ఒవైసీ కాలనీలోని బర్ఖాన్‌షా దర్గాలో జరుగుతున్న ఉర్సు ఉత్సవాలకు స్నేహితులతో కలిసి హాజరయ్యాడు. ఉర్సు ఊరేగింపు ఒవైసీ కమాన్ వద్దకు రాగానే గుర్తు తెలియని వ్యక్తులు మోహిత్ ఖాన్ అడ్డగించి కత్తితోదాడి చేసి అక్కడి నుంచి పరారయ్యారు. రక్త మడుగులో పడి ఉన్న ఆతన్ని స్థానికుల సహాయంతో పోలీసులు చికిత్స నిమిత్తం ఒవైసీ దవాఖానకు తరలించగా, పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లుగా ధృవీకరించారు. హత్య సమాచారం తెలిసిన వెంటనే సంఘటనాస్థలాన్ని సంతోష్‌నగర్ డివిజన్ ఏసీపీ గౌస్‌ఖాన్, ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ పరిశీలించి వివరాలను సేకరించి దర్యాప్తు చేస్తున్నారు

కార్లు అద్దెకు తీసుకుని.. తాకట్టు పెట్టి

వెంగళరావునగర్, నవంబర్ 21: కారు అద్దెకు తీసుకొని యజమానికి తెలియకుండా మరో చోట తాకట్టు పెట్టి ఓ ఇద్దరు ప్రబుద్ధులు కొత్త రకం మోసాలకు తెరలేపారు. ఆంధ్రప్రదేశ్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చెందిన సూర్యతేజకు ఓ ప్రైవేట్ కార్యాలయంలో ఫ్రంట్ ఆఫీస్ ఎగ్జిక్యూటివ్ గా పని చేసేవాడు. అరవింద్,మధు అనే ఇద్దరు సూర్యతేజ వద్దకు వచ్చి కార్లను అద్దెకు తీసుకుని హైదరాబాద్ లోని పెద్ద కంపెనీలకు అద్దెకు ఇచ్చి కార్ల యజమానులకు ప్రతినెలా డబ్బిస్తామని చెప్పారు. దీంతో సూర్యతేజ జూన్ 6వ తేదీన నగరానికి వచ్చి యూసుఫ్‌గూడ లో తన కారును మధుకు అప్పచెప్పాడు. మొదట్లో 3 నెలల పాటు అరవింద్ ద్వారా మధు రూ.40 వేలు సూర్యతేజకు చెల్లించాడు. తనకు మరిన్ని కార్లు అవసరమని అరవింద్ చెప్పడంతో ఇదే విషయాన్ని సూర్యతేజ తన ఇతర మిత్రులతో అరవింద్ వద్దే కార్లు అద్దెకు పెట్టించాడు. వారికి కూడా ఒకట్రెండు నెలలు డబ్బు చెల్లించి ఆ తర్వాత అరవింద్, మధులు డబ్బులు ఇవ్వకుండా ముఖం చాటేశారు. ఈ నేపథ్యంలో కారులో అద్దెకిచ్చిన వారిలో ఒకరైన యోగిరాజు తన కారు శంషాబాద్‌లో ఉన్నట్లు జీపీఎస్ ద్వారా కనుక్కొని అక్కడికి వెళ్లి చూడగా నంబర్‌ప్లేట్ కనిపించలేదు. కారు ఆగి ఉన్న బేకరీ యజమానిని ఇదే విషయాన్ని ప్రశ్నించగా ..మధు అనే వ్యక్తి తన వద్ద కారును తాకట్టు పెట్టి 1.20 లక్షలు తీసుకున్నట్టు చెప్పడంతో బాధితులైన కారు యజమానులు అరవింద్, మధులను నిలదీశారు. దీంతో నిందితులు ఫోన్లు స్విచాఫ్ చేసుకొని పరారయ్యారు. బాధితులు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఖైదీల సంక్షేమానికి జైళ్ల శాఖ కృషి చేస్తున్నది

జైళ్ల శాఖ ఐజీ మురళిబాబు, డిప్యూటీ ఐజీ శ్రీనివాస్‌లు

చర్లపల్లి, నవంబర్ 21 : సిబ్బంది, ఖైదీల సంక్షేమానికి జైళ్ల శాఖ కృషి చేస్తున్నదని జైళ్ల శాఖ హైదరాబాద్ రెంజ్ ఐజీ మురళి బాబు, జైళ్ల శాఖ హైదరాబాద్ రెంజ్ డీఐజీ శ్రీనివాస్‌లు పేర్కొన్నారు. చర్లపల్లి కేంద్ర కారాగారంలో పునశ్చరణ(రిట్రీట్) కార్యక్రమంను డైరక్టర్ ఆఫ్ మెడికల్ అండ్ హెల్త్ అధికారి డాక్టర్ టీ.రఘునాథస్వామితో కలిసి వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర కారాగారంలోని సిబ్బంది సమస్యలను పరిష్కరించడంలో జైళ్ల శాఖ కృషి చేస్తున్నదన్నారు. ప్రతి సంవత్సరం సిబ్బంది కోసం పునశ్చరణ తరగతులు నిర్వహిస్తున్నామని, సిబ్బంది అంకిత భావంతో పనిచేసి జైళ్ల శాఖకు గుర్తింపు తీసుకురావాలని వారు సూచించారు. తెలంగాణ రాష్ట్ర డైరక్టర్ ఆఫ్ మెడికల్ అండ్ హెల్త్ అధికారి డాక్టర్ టీ.రఘునాథ స్వామి మాట్లాడుతూ ఖైదీలు, సిబ్బందికి కావాల్సిన సౌకర్యాలు కల్పించడం హర్షనీయమన్నారు. ఈ సందర్భంగా సంవత్సర కాలంగా జైలులో చేపట్టిన సంస్కరణలు, ఖైదీలు, సిబ్బంది సంక్షేమానికి తీసుకున్న చర్యల గూరించి చర్చించారు. ఈ కార్యక్రమంలో చర్లపల్లి కేంద్ర కారాగారం, ఖైదీల వ్యవసాయక్షేత్రం సూపరింటిండెంట్లు రామచంద్రం, సమ్మయ్యలతో పాటు డిప్యూటీ సూపరింటిండెంట్లు, జైలర్లు, డిప్యూటీ జైలర్లు, వార్డెన్లు, సిబ్బంది, ఖైదీలు తదితరులు పాల్గొన్నారు.

ఆరోబోసిన వడ్లను గమనించక..

దుండిగల్: ద్విచక్రవాహనం అదుపుతప్పి ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. దుండిగల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...డీ. పోచంపల్లిలోని సారెగూడెంకు చెందిన చంద్రశేఖర్‌రెడ్డి(23) సర్వీస్ ప్రొవైడర్‌గా పనిచేస్తున్నాడు. మేడ్చల్ పరిధిలోని ఓ పరిశ్రమలో పనిచేసి చీకటి పడ్డాక తన బైక్‌పై ఓఆర్ ఆర్ సర్వీస్ రోడ్డులో వస్తుండగా, దుండిగల్‌లోని డబుల్‌బెడ్రూం ఇండ్ల సమీపం వద్ద రోడ్డుపై వడ్లు ఆరబోయడంతో చంద్రశేఖర్ రెడ్డి గమనించలేదు. ఈ క్రమంలో వాటి పైనుంచి వెళ్లడంతో బైక్ అదుపుతప్పి రోడ్డుపై పడిపోయాడు. తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే చనిపోయాడు.

టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సుకు ఫీజు గడువు డిసెంబర్ 3

మేడ్చల్ కలెక్టరేట్, నవంబర్ 21: టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సులైన డ్రాయింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీలో లోయర్, హయ్యరు గ్రేడ్ పరీక్షలు జనవరి 2025లో జరుగుతాయని, ఈ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు పరీక్ష ఫీజులను డిసెంబర్ 3వ తేదీలోపు చెల్లించాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా విద్యాశాఖాధికారిణి విజయ కుమారి తెలిపారు. అభ్యర్థులు అన్‌లైన్ వైబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకొని పరీక్ష ఫీజులు చెల్లించాలని, దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకొని మల్కాజిగిరి మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సమర్పించాలని సూచించారు. డ్రాయింగ్ లోయర్ పరీక్షలకు రూ.100, డ్రాయింగ్ హయ్యర్ పరీక్షకు రూ.150, టైలరింగ్, ఎంబ్రాయిడరీ లోయర్ పరీక్షకు రూ.150 చొప్పున, టైలరింగ్, ఎంబ్రాయిడరీ హయ్యర్ పరీక్షకు రూ.200 చొప్పున ఫీజులు చెల్లించాలని పేర్కొన్నారు. వచ్చే నెల 3వ తేదీలోపు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఫీజులు చెల్లించేందుకు అవకాశం ఉందని, డిసెంబర్ 10వ తేదీలోపు రూ.50 అపరాధ రుసుముతో, డిసెంబర్ 17వ తేదీలోపు రూ.75 అపరాధ రుసుముతో ఫీజులు చెల్లించాలని తెలిపారు.

హవాలా నగదు 22 లక్షలు పట్టివేత

పాసింగ్ అవుట్ పరేడ్‌లో పాల్గొన్న అదనపు డీజీపీ వీవీ శ్రీనివాసరావు

సుల్తాన్‌బజార్,నవంబర్ 21. కోఠిలోని గుజరాతి గల్లీలో పోలీసులు గురువారం 22 లక్షల రూపాయల హవాల నగదును స్వాధీనం చేసుకున్నారు. సుల్తాన్‌బజార్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసాచారి తెలిపిన వివరాల ప్రకారం మొఘల్ పురా ప్రాంతానికి చెందిన ఫర్నీచర్ వ్యాపారి మహ్మద్ అబ్దుల్ ఖయ్యూం(47), గుజరాతి గల్లీలోని పద్మావతి ఎలక్ట్రానిక్ షాప్ వ్యాపారి ఉత్తమ్ కుమార్(34), సుల్తాన్‌బజార్‌కు చెందిన లలిత్ సింగ్(32)లు ఒక వద్ద గుమిగూడారు. విశ్వసనీయ సమాచారం మేరకు సాయంత్రం 5 గంటల ప్రాంతంలో కానిస్టేబుళ్లు దీపక్, మచ్చగిరి, నవీన్‌రెడ్డి, హెచ్‌జీలు కృష్ణమూర్తి, రాధాకృష్ణల తో కలిసి సీఐ శ్రీనివాసాచారి నిఘా ఉంచారు. అదే సమయంలో వారి వద్దన్న బ్లూ కలర్ బ్యాగు అ నుమానాస్పదంగా కనిపించడంతో వెంటనే వారి వద్దకు చేరుకొని తనిఖీ నిర్వహించగా ఆ బ్యాగులో 22 లక్షల నగదు లభ్యమైంది. ఇందుకు సంబంధించి వారి వద్ద ఎలాంటి ఆధార పత్రాలు లేకపోవడంతో 22 లక్షల నగదును స్వాధీనం చేసుకొని ఆదాయపు పన్ను డైరెక్టర్‌కు అప్పగించామని చెప్పారు.

పోలీసు ఉద్యోగం ఉన్నతమైనది

అదనపు డీజీపీ వీవీ శ్రీనివాసరావు

సిటీబ్యూరో, నవంబర్ 21(నమస్తే తెలంగాణ): పోలీసు ఉద్యోగం అనేది ఉన్నతమైన, గౌరవప్రదమైనదని అదనపు డీజీపీ(టెక్నికల్) శ్రీనివాసరావు అన్నారు. గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్ లోని పరేడ్‌గ్రౌండ్‌లో గురువారం జరిగిన 7వ బ్యాచ్ స్టైపెండరీ క్యాడెట్ ట్రైనీ పోలీస్ కానిస్టేబుల్స్ పాసింగ్ ఔట్ పరేడ్ (దీక్షాంత్ పరేడ్) కార్యక్రమానికి అదనపు డీజీ శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై పాసింగ్ ఔటైన కానిస్టేబుళ్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం, ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ (టీఎస్ఎల్‌పీఆర్‌బీ) పారదర్శకంగా నియామక ప్రక్రియను చేపట్టడం అభినందనీయమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 18 వేల ఖాళీలకుగాను 8 లక్షల దరఖాస్తులు వచ్చాయని వివరించారు. ఇంత పెద్ద పోటీలో ఎంపికైన క్యాడెట్లను ఈ సందర్భంగా అభినందించారు. సమర్థవంతమైన పోలీసు సేవకు పునాదిగా సమగ్రత, క్రమశిక్షణ, నిబద్ధతతో పనిచేయాలని క్యాడెట్లకు సూచించారు. పోలీసు సేవ అనేది ఎంతో గౌరవ ప్రదమైనదని, ఉన్నతమైన వృత్తిగా అభివర్ణించారు. నేర రహిత సమాజం కోసం పనిచేయాలన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సైబరాబాద్ పోలీసు కమిషనర్ అవినాష్ మహంతి మాట్లాడుతూ, క్యాడెట్లు తమ పని పట్ల గర్వపడాలని, క్రమశిక్షణతో ఉంటూ సమాజం తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టేందుకు కృషి చేయాలన్నారు. ప్రజల విశ్వాసాన్ని కాపాడుకోవడంలో, క్రమశిక్షణ, సమయపాలన, వృత్తి నైపుణ్యం ప్రాధాన్యతను గుర్తుచేశారు. కార్యక్రమంలో సీటీసీ ప్రిన్సిపాల్ డీసీపీ ఎల్.సి.నాయక్, సైబరాబాద్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్, మాదాపూర్ డీసీపీ వినీత్, మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి, శంషాబాద్ డీసీపీ బి.రాజేష్, బాలానగర్ డీసీపీ కె.సురేశ్ కుమార్, రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్, క్రైమ్ డీసీపీ కె.నర్సింహా, ఈఒడబ్ల్యూ డీసీపీ కె.ప్రసాద్, ఉమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ డీసీపీ సృజన కర్ణం పాల్గొన్నారు.

రైళ్లలో చోరీలు చేస్తున్న దొంగ అరెస్టు

26 తులాల బంగారం స్వాధీనం

మారేడ్‌పల్లి, నవంబర్ 21: రైళ్లలో ప్రయాణికుల బంగారు ఆభరణాలను దొంగతనాలకు పాల్పడుతున్న అంతరాష్ట్ర దొంగల ముఠా సభ్యుల లో ప్రధాన నిందితుడిని సికింద్రాబాద్ రైల్వే పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ చేశారు. సికింద్రాబాద్ రైల్వే పోలీసు స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రైల్వే డీఎస్పీ ఎస్ఎన్ జావేద్, రైల్వే ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్ లు కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఢిల్లీకి చెందిన రణవీర్ సింగ్ (48) వృత్తి రీత్యా డ్రైవర్. కొంతకాలంగా రణవీర్ సింగ్ రైళ్లలో దొంగతనాలకు పాల్పడుతూ.. ఢిల్లీ, కర్ణాటక, రాజస్థాన్ రైల్వే పోలీసులకు చిక్కి జైలుకు కూడా వెళ్లొచ్చాడు. హర్యానాకు చెందిన సంషీర్, సుమిత్, సత్వీర్, జగదీశ్‌లతో చేతులు కలిపి చోరీలను ముమ్మరం చేశారు. కాగా గురువారం నాడు నిందితుడు రణవీర్ సింగ్ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో అనుమానాస్పదంగా తిరుగుతుండగా.. పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. పలు రైళ్లలో చోరీ చేసినట్టుగా నిందితుడు అంగీకరించాడు. అతని వద్ద నుంచి 26.5 తులాల బంగారు ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన నలుగురు నిందితులు పరారీలో ఉన్నట్టు పోలీసులు వెల్లడించారు. నిందితుడిని పట్టుకోవడంలో చాకచాక్యంగా వ్యవహరించిన రైల్వే పోలీసు సిబ్బందిని రైల్వే డీఎస్పీ అభినందించారు. ఈ మీడియా సమావేశంలో రైల్వే ఎస్ఐ మాజీద్, రైల్వే పోలీసు సిబ్బంది మహిపాల్‌రెడ్డి, సుఖ్‌దేవ్, వేణుగోపాల స్వామి, బి. హరిలాల్, నాగుబాషా, కె. భవానీ శంకర్, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సరస్వత్ తదితరులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్ రైల్వే పోలీసు స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడిస్తున్న రైల్వే డీఎస్పీ ఎస్ఎన్ జావేద్, ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్ తదితరులు

జీతాలు రావట్లేదు.. ఇల్లు గడిచేదెట్లా..?

మాజీ మంత్రి పి.సబితారెడ్డిని చూసి గోడు వెళ్లబోసుకున్న గొల్లూరు గ్రామ పంచాయతీ సిబ్బంది

సంబంధిత అధికారులతో మాట్లాడుతానని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే

బడంగ్‌పేట, నవంబర్ 21: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన్నప్పటి నుంచి వేతనాలు రావడం లేదని గొల్లూరు గ్రామ పంచాయతీ సిబ్బంది మాజీ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డికి చెప్పి కన్నీటి పర్యంతమయ్యారు. మహేశ్వరం మండలం గొల్లూరు గ్రామం మీదగా మాజీ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి వెల్తున్న విషయాన్ని పంచాయతీ సిబ్బంది చూశారు. సిబ్బంది దీనంగా నిలబడిన విషయాన్ని గమినించిన ఎమ్మెల్యే కాన్వాయిని ఆపి వారిని పలకరించారు. ఎమ్మెల్యేను చూసి వారు కన్నీటి పర్యంతం కావడంతో.., ఆమె ఏం జరిగిందని వారిని అడిగారు. కొన్ని నెలల నుంచి గ్రామ పంచాయతీ నుంచి జీతాలు రావడం లేదని, రాకపోతే ఎలా బతకాలని వారు గోడు వెల్లబోసుకున్నారు. ఎవరికి చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత పంచాయతీ కార్యదర్శికి ఫోన్ చేయడంతో ఆయన ఎమ్మెల్యే ఫోన్ లిఫ్ట్ చేయలేదు. వేతనాలు రాకపోవడంతో ఇబ్బందిగా ఉందన్నారు. ఎలాగైనా తమ సమస్యను పరిష్కరించాలని ప్రాధేయ పడ్డారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించే విధంగా చొరవ తీసుకుంటానని ఆమె వారికి భరోసా ఇచ్చారు. సిబ్బందిని ఓదార్చి, ధైర్యంగా ఉండాలని వారికి సూచించారు. కాంగ్రెస్ పాలనలో ఎవ్వరూ ప్రశాంతంగా లేరన్నారు.



ఎమ్మెల్యే సబితారెడ్డికి సమస్యలు విన్నవిస్తున్న గొల్లూరు గ్రామ పంచాయతీ సిబ్బంది

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (భారత ప్రభుత్వరంగ సంస్థ)

అస్సెట్ రికవరీ శాఖ
249/3RT, మొదటి అంతస్తు,
S.R. నగర్ మెయిన్ రోడ్, హైదరాబాద్-500 038.

ఇ-వేలం అమ్మకం ప్రకటన

(సెక్యూరిటీ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002లోని రూల్ 8(6)కు నిబంధన చూడండి)

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6)కు నిబంధనతో చదువబడే సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన. దిగువ తెలిపిన రుణగ్రహీత(లు) మరియు హామీదారు (లు) నుండి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు దిగువ తెలిపిన బకాయిలు రాబట్టుకొనుట కొరకు సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖా పెట్టిన/ఛార్జ్ చేసిన, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (సెక్యూర్డ్ క్రెడిటార్) అధీకృత అధికారిచే లాంఛనప్రాయ/భౌతిక స్వాధీనం చేసుకోబడిన దిగువ వివరించిన స్థిరాస్తి "ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అదే" ప్రాతిపదికన దిగువ తెలిపిన తేదీన విక్రయించబడుతుందని సాధారణ ప్రజానీకానికి మరియు ముఖ్యంగా రుణగ్రహీత/లు మరియు హామీదారు/లకు ఇందుమూలముగా తెలియజేయడమైనది. రిజర్వు ధర, బయానా దిగువ తెలియజేయబడినవి:

రుణగ్రహీత/ల పేరు మరియు చిరునామా: శ్రీ ఐల శ్రీధర్, ఇం.నెం. 2-10-76/2, వార్డ్ నెం. 2, బ్లాక్ నెం. 10, కుమ్మరబస్తీ, ఉప్పల్, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా, తెలంగాణ-500 039. శ్రీమతి నందిని పంజల, ఇం.నెం. 2-10-76/2, వార్డ్ నెం. 2, బ్లాక్ నెం. 10, కుమ్మరబస్తీ, ఉప్పల్, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, తెలంగాణ-500 039.
స్థిర సెక్యూర్డ్ ఆస్తిని విక్రయించుట ద్వారా రాబట్టుకోవలసిన సెక్యూర్డ్ రుణం: 31.10.2024 నాటికి రూ. 1,06,92,295.84 మరియు తదుపరి వడ్డీ, వ్యయాలు మరియు ఖర్చులు.

విక్రయించబడు స్థిర సెక్యూర్డ్ ఆస్తుల వివరణ

వార్డ్ నెం. 2, బ్లాక్ నెం. 10, కుమ్మరబస్తీ, ఉప్పల్ కలాన్ గ్రామం, GHMC పరిధిలో, ఉప్పల్ సర్కిల్, ఉప్పల్ మండలం, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, తెలంగాణ రాష్ట్రం వద్దగల, ప్లింత్ ఏరియా 2363 చ.అ. (గ్రౌండ్ ఫ్లోర్ ప్లింత్ ఏరియా 590.75 చ.అ., మొదటి అంతస్తు ప్లింత్ ఏరియా 590.75 చ.అ. రెండవ అంతస్తు ప్లింత్ ఏరియా 590.75 చ.అ. మరియు మూడవ అంతస్తు ప్లింత్ ఏరియా 590.75 చ.అ.)తో మూడు అంతస్తుల ఆర్‌సిసి రూఫ్ బిల్డింగ్‌తో 110 చ.గజాలు లేదా 91.96 చ.మీటర్లు విస్తీర్ణపు భూమి, సర్వే నెం. 732, PTIN No. 1020212052, ఇం.నెం. 2-10-76/2బి (కొత్తది) (